# పశ్చిమ బెంగాల్ : 50 సం॥ల నగ్జల్బరీ పోరాట సంస్మరణ




నగ్జల్బరీలో ప్రజా ప్రదర్శన




బహిరంగసభ

**నగ్జల్బరీ, 25-5-17 :**

నగ్జల్బరీ పోరాట 50 సం॥ల సందర్భాన్ని పురస్కరించుకొని సిపిఐ(ఎం-ఎల్)తో సహా వివిధ ఎం-ఎల్ పార్టీలు, సంస్థలు, భాగస్వాములుగా 'కమిటి ఫర్ అబ్జర్వేషన్ ఆఫ్ ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ నగ్జల్బరీ స్ట్రగుల్' పేరుతో ఓ కమిటి ఏర్పడింది.

నగ్జల్బరీ పోరాటం యొక్క ప్రాసంగికతను, నగ్జల్బరీ తిరుగుబాటు చూపించిన పంథా యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ఈ కమిటీ విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించింది. కరపత్రాలు, పోస్టర్లు, వీధి మీటింగ్‌ల వంటి రూపాల్లో పశ్చిమబెంగాల్‌లోని అనేక జిల్లాల్లో ప్రజల మధ్యకు నగ్జల్బరీ పిలుపును చేరవేసింది. మే 25వ తేదీన ఈ ప్రచార కార్యక్రమ ముగింపుగా సిలిగురిలో ప్రజా ప్రదర్శన, బహిరంగసభ నిర్వహించింది.

మే 24న సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో నగ్జల్బరీలోని ఝూరుజోటే వద్ద ఓ సభను నిర్వహించారు. 1967 మే 24న ఇదే ప్రాంతంలో రైతాంగం పోలీసులతో తలపడ్డారు. దీనిలో ఓ పోలీసు ఇన్‌స్పెక్టర్ మరణించాడు. 'నగ్జల్బరీ డే'ను సంస్మరిస్తూ స్థానిక స్థాయిలో నిర్వహించిన చిన్న సభ ఇది. కామ్రేడ్స్ సుబోధ్‌మిత్ర, అలోక్ ముఖర్జీ, నాధూరామ్ బిశ్వాస్, ఖుదన్ మల్లిక్ మరియు కవిరాజ్‌రే ఈ సభలో ప్రసంగించగా, కా॥ శాంతిముండా అధ్యక్షతన ఈ సభ జరిగింది. కామ్రేడ్ కృష్ణ బసు, బసు ఆచార్యులు కూడా ఈ సభలో పాల్గొన్నారు.

నగ్జల్బరీలోని ప్రసాదుజోతె వద్దనున్న అమరుల స్మారక స్థూపాల వద్దకు వివిధ ప్రాంతాల నుండి ఎం-ఎల్ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు చేరుకోవటంతో మే 25వ తేదీన కార్యక్రమం ప్రారంభ మైంది. 1967 మే 25న ప్రదర్శనగా సాగుతున్నవారిపై పోలీసులు, అర్ధ-సైనిక బలగాలు జరిపిన కాల్పులలో ఓ రైతు, ఓ పసిబిడ్డతోపాటు మృతిచెందిన మరో 9 మంది మహిళల స్మారక స్థూపం వద్ద వారంతా శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఐ(ఎం-ఎల్) నుండి కామ్రేడ్స్ సుబోధ్‌మిత్ర, నాధూరామ్ బిశ్వాస్‌లు అమరులకు జోహార్లర్పించారు.

పూర్ణేందు వికాస్ ముఖర్జీ, అపర్ణా సరిన్, ఝూర్ణాదే, రతన్ ముఖర్జీ మరియు నాధూరామ్ బిశ్వాస్‌లతో సభా నిర్వహణకు ఓ అధ్యక్షవర్గాన్ని ఎన్నుకున్నారు. మేఘనాథ్, అంబికల పాటతో సభ ప్రారంభమైంది. అమరుల స్మృతిలో సభకు హాజరైన యావన్మంది లేచి నిలబడి రెండు నిముషాలు మౌనం పాటించారు. నగ్జల్బరీ పోరాటంలో పాల్గొని, ఈ నాటికీ సజీవంగా వున్నవారిని అధ్యక్షవర్గం వేదికపైకి ఆహ్వానించింది. వారిలో - ఖోకన్ మజుందార్ అప్పటికే అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూండగా, 95 సం॥ల కామ్రేడ్ ముజిబర్ రహ్మాన్ అనారోగ్యం, వార్ధక్యంతో రాలేకపోయారు. కాగా, కామ్రేడ్స్ ఖుదన్ మల్లిక్, శాంతి ముండా, సునీతి విశ్వ కర్మార్కర్, కుమార్ కిషన్, నామ్ కిషన్‌లను సభా వేదికపైకి సాదరంగా ఆహ్వానించి సత్కరించారు.

సిపిఐ(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కా॥ సుశాంత్ ఝా నగ్జల్బరీ ఉద్యమ నేపథ్యాన్ని, ప్రస్తుత పరిస్థితులలో దాని ప్రాసంగికతను వివరించారు. సిపిఐ(ఎం-ఎల్) సిఓసికి నాయకులు కా॥ సోమనాధ్ ఛటర్జీ ఛత్తీస్‌ఘడ్ ప్రజల పక్షాన నిలవవలసిందిగా ప్రజానీకానికి పిలుపునిచ్చారు.

సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ అలోక్ ముఖర్జీ మాట్లాడుతూ 2017 సం॥ చాలా గుర్తింపు కలిగిన సం॥గా పేర్కొన్నారు. 50 సం॥ల నగ్జల్బరీ పోరాటం, మహత్తర అక్టోబరు విప్లవ శత వార్షికోత్సవం, కార్ల్‌మార్క్స్ రచన 'దాస్ క్యాపిటల్' ప్రచురించి 150 సం॥లు అయిన సందర్భాలను గుర్తుచేశారు. సిద్ధాంత, ఆచరణాత్మకరంగాలతోపాటు తాత్విక, భావజాల రంగంలోనూ నగ్జల్బరీ పోరాటం ప్రభావం నెరిపి గుర్తింపు పొందిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తి విధానంలో మార్పులొచ్చాయనే భావజాలపరమైన ప్రచారంతో నగ్జల్బరీ మార్గాన్ని సవాల్ చేసేవిధంగా దాడులు ముందుకొస్తున్నాయన్నారు. దీని అర్థమేమంటే, ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాల అవసరంలేదని, దీర్ఘకాల ప్రజాయుద్ధం యొక్క అవసరంలేదనేదన్నారు. సిద్ధాంత ఆచరణరంగాల్లో ఈ భావనలను, ప్రచారాన్ని తిప్పికొట్టాల్సి వుందన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కా॥ ప్రదీప్ మాట్లాడుతూ కామ్రేడ్స్ టి.ఎన్, డి.వి., సి.ఎం.ల శతజయంతుల సం॥ కూడా 2017 అని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతంలో చోటుచేసుకున్న మార్పులేవైనప్పటికీ, అవి మన వ్యూహంలో గుణాత్మక మార్పును తేగలిగేవి కాదని ఆయన పేర్కొన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ సుబోధ్‌మిత్ర మాట్లాడుతూ 1967 నాటివలె ఈరోజుకీ నగ్జల్బరీ పోరాటం యొక్క ప్రాసంగికత, గుర్తింపు ఏమాత్రం తగ్గలేదన్నారు. నగ్జల్బరీ స్ఫూర్తితో ముందుకొచ్చి, పార్టీని చీలికలకు గురిచేసినవారు తమకుతాము ఎందుకూ కొరగానివారిగా మారిపోతున్నారంటూ ఈ పరిస్థితుల్లో మార్పు రావాలన్నారు.

ఇంకా ప్రొఫెసర్ ప్రణబ్ నాయక్, కా॥ సుఖేందు సర్కార్ తదితరులు ఈ సభలో ప్రసంగించారు.

కేంద్ర హోంశాఖామంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పది రాష్ట్రాల హోంశాఖా మంత్రులతో నిర్వహించిన సమావేశం అనంతరం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దాడి స్వభావం గల విధానాన్ని ఈ సభ తీవ్రంగా ఖండిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. రానున్న కాలంలో ప్రయోగించనున్న నిర్బంధాన్ని ఈ కేంద్ర ప్రభుత్వ 'సమాధాన్' అనే విధానం తేటతెల్లం చేస్తోంది.

అధ్యక్షవర్గం తరపున కా॥ పూర్ణేందు వికాస్ మాట్లాడారు. విప్లవ గీతాలను పాడారు. ఆదివాసుల నృత్యాలు ప్రదర్శించారు.

ooooo